
సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం, 9, ఏప్రిల్, 2023



అభాగ్యులపై 'వాత్సల్యం'
పేదరికం, నిరాదరణకు గురైన చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం చేయూతనిస్తోంది.
- 8లో



దర్శనానికి 3 గంటలు
వరుస సెలవులు రావడంతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది.
- 10లో

గరిష్టం/కనిష్టం 38°/24°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-36 (ఆదివారం సాయంత్రం)
సహర్ 4-40 (సోమవారం ఉదయం)

న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షకు 8,971 మంది హాజరు

భువనగిరి : పదవ తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన గణితం పరీక్షకు 8,987 మంది విద్యార్థులకు గాను 8,971 హాజరయ్యారు. 16 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారి కె.నారాయణరెడ్డి తెలిపారు. పరీక్షల కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మోడల్ స్కూళ్ల అదనపు డైరెక్టర్ రమణకుమార్, డీఈఓలు తనిఖీ చేశారు.

మోదీ హయాంలోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి



నరేంద్రమోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న గూడూరు నారాయణరెడ్డి

బీబీనగర్ : ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని, రాష్ట్రంలోనూ అభివృద్ధి జరుగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. బీబీనగర్ ఎయిమ్స్‌కు రూ.1,366 కోట్లు మంజూరు చేసి నూతన భవనాలకు శనివారం శంకుస్థాపన చేసిన సందర్భంగా మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుగూ.. ఎయిమ్స్ 750 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మారబోతుందని, తద్వారా ప్రజలకు అత్యాధునిక వైద్యం అందనుందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం చిత్తశుద్ధితో పని చేస్తుందగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, వినయ్, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, సత్తీష్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న జూలియన్

మోత్కూరు : పంట మార్పిడి చేయడం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని మదర్ థెరిస్సా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ జిల్లా డైరెక్టర్ ఫాదర్ జూలియన్ అన్నారు. మోత్కూరు మండలం పాలడుగులో రైతు ఉత్పత్తి సంఘం సభ్యులకు పంటల సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ఆయన పాల్గొని సలహాలు, సూచనలు చేశారు. ఎప్పుడు ఒకే పంట వేయడం కంటే మార్పిడి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. గ్రామ రైతు సంఘానికి తమ సంస్థ నిధులతో సొంత భవనం నిర్మిస్తామని ప్రకటించారు.మత్స్యగిరి రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రిపల్లి యాదయ్య, మాజీ సర్పంచ్ అంతటి నర్సయ్య, రైతు కోఆర్డినేటర్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ ఎడ్ల భగవంత్, సంఘం ప్రతినిధి రాజు, సంఘం సీఈఓ నర్సింహాచారి, డైరెక్టర్లు వెంకటయ్య, యాదయ్య, గోపాల్‌రెడ్డి, యాస మాధవి, కొంపెల్లి లలిత, ఉప్పలయ్య, నర్సయ్య, మత్స్యగిరి, ఇద్దయ్య, రమేష్, ఉపేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాయజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న పీఠాధిపతి, భక్తులు

యాదగిరిగుట్ట : అఖండనామ ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న మహాయజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. శనివారం తెల్లవారుజామున అఖండనామ ఆశ్రమ నిర్వాహకులు గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ పూజలు జరిపించారు. మధ్యాహ్నం సుబ్రహ్మణ్య గాయత్రి హవన పూజ నిర్వహించారు.

ప్రతిష్టాత్మక వైద్య సంస్థకు ప్రధాని శంకుస్థాపన



ఎయిమ్స్ భవన నిర్మాణాలకు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ



కార్యక్రమాన్ని వీక్షిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్న ఎయిమ్స్ వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది

- ఎయిమ్స్ భవన నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన మోదీ
- సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన సభా వేదిక నుంచి కార్యక్రమం
- బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎల్‌ఈడీపై ప్రదర్శన
- వీక్షించి హర్షం వ్యక్తం చేసిన వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది

సాక్షి, యాదాద్రి : బీబీనగర్ పరిధిలోని రంగాపురంలో గల ప్రతిష్టాత్మక ఎయిమ్స్‌లో 201 ఎకరాల్లో నూతనంగా నిర్మించనున్న అదనపు భవన నిర్మాణాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభా వేదిక నుంచి ఈ కార్యక్రమం చేపట్టారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని వైద్యులు, విద్యార్థులు, సిబ్బందితో పాటు స్థానికు లు వర్చువల్‌గా వీక్షించారు. ఇందుకోసం ఎయిమ్స్‌లోని ఓపీడీ బ్లాక్‌లో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలుకు ప్రధాని పచ్చజెండా ఊపి ప్రారంభించడం, ఎయిమ్స్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయ డం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఎయిమ్స్ గురించి ప్రధాని ప్రస్తావించిన సమయంలో లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అల్కా, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న అధికారులు వీరే..
ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, డీన్ రాహుల్ నారంగ్, మెడికల్ సూపరింటెండెంట్ నీరజ్ అగర్వాల్‌తో పాటు మరికొందరు వైద్యులు మోదీని పరేడ్ గ్రౌండ్‌లో కలిసి శంకుస్థాపనలో పాల్గొన్నారు.



మోదీ ప్రసంగాన్ని వింటున్న ఎయిమ్స్ సిబ్బంది

పాఠశాలలకు ట్యాబ్‌లొచ్చాయ్

- సమాచారం ఆన్‌లైన్‌లోనే నిక్షిప్తం
- ఉపాధ్యాయులకు తొలగనున్న ఇబ్బందులు



డీఈఓ కార్యాలయంలో భద్రపర్చిన ట్యాబ్‌లు

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో కాగితపు రహిత సేవలు అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు ట్యాబ్‌లు అందజేస్తోంది. జిల్లాకు 496 ట్యాబ్‌లు చేరాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సేవలన్నీ ఆన్‌లైన్‌లో ద్వారానే కొనసాగనున్నాయి. ప్రతి పాఠశాలలో పది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే ఒక ట్యాబ్, 165 దాటితే మరో ట్యాబ్ ఇవ్వాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన ట్యాబ్‌లు జిల్లాకు వచ్చాయి.

నమోదు చేయనున్న వివరాలు ఇలా..
యుడైస్, యుడైస్ ప్లస్‌తో పాటు ఇతర వివరాలను ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలాకాలంగా ట్యాబ్‌లు ఇవ్వాలని కోరుతూ వస్తున్నారు. దీనికి స్పందించిన ప్రభుత్వం మొదట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఇవ్వాలని నిర్ణయించింది. విద్యార్థుల అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాల, యూనిఫాం వివరాలు, మధ్యాహ్న భోజనం, హాజరు, వసతుల కల్పనకు సంబంధించిన ఫొటోలు, ఉపాధ్యాయుల నివేదికలను ఆన్‌లైన్‌లో సకాలంలో చేరవేసేలా ట్యాబ్‌లు ఉపయోగపడనున్నాయి. ట్యాబ్‌ల వినియోగంపై మొదట సమగ్ర శిక్ష అధికారులు, ఎస్‌ఆర్పీలకు, ఆ తర్వాత ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

496 ట్యాబ్‌లు
జిల్లాలో ప్రాథమిక 421, ప్రాథమికోన్నత పాఠశాలలు 67 ఉన్నాయి. మొత్తం 496 ట్యాబ్‌లు వచ్చాయి. వీటిని డీఈఓ కార్యాలయంలో భద్రపరిచారు.శిక్షణ అనంతరం ఉపాధ్యాయులకు అందజేయనున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మోత్కూరు : వరి కోతలు మొదలై మార్కెట్‌లకు ధాన్యం వస్తున్నందున వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం వల్ల రైతులు దళారులకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. రైతులు 50శాతం ధాన్యం అమ్ముకున్న తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల మద్దతు ధర కోల్పోవాల్సి వస్తుందన్నారు. అంతేకాకుండా ధాన్యం కొనుగోలు చేసిన దళారులు బినామీ పేర్లతో మార్కెట్‌లకు తరలించి మద్దతు ధరకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. జాప్యం చేయకుండా కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, పట్టణ కార్యదర్శి పుల్కరం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేసింది.. 'వందేభారత్'

- వందేభారత్ రైలును చూసేందుకు తరలివచ్చిన ప్రజలు, విద్యార్థులు
- నల్లగొండలో పూలుచల్లి స్వాగతం
- ట్రైన్‌లోకి వెళ్లి కూర్చుని అనుభూతి పొందిన ప్రజలు
- పూర్తి స్వదేశీ సాంకేతికతతో వందేభారత్ రైలు : ఏడీఎం



వందేభారత్ రైలులో విద్యార్థుల ప్రయాణం

నల్లగొండ రూరల్ : సికింద్రాబాద్ నుంచి తిరుపతికి నల్లగొండ మీదుగా వెళ్లే వందేభారత్ రైలుకు నల్లగొండలో శనివారం ప్రజలు, విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సికింద్రాబాద్‌లో ప్రధాని మోదీ ప్రారంభించిన తర్వాత నల్లగొండ మీదుగా తిరుపతి వెళ్తున్న వందేభారత్ రైలును చూసేందుకు ప్రజలు నల్లగొండ రైల్వే స్టేషన్‌కు భారీగా తరలివచ్చారు. వందేభారత్ రైలు రాక సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రమ్స్ మోతతో రైల్వే స్టేషన్ ప్రాంగణం మార్మోగింది. స్టేషన్‌లో వందేభారత్ రైలుతో ప్రజలు, విద్యార్థులు ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఐదు నిమిషాల పాటు ఆగడంతో కొందరు లోపలికి వెళ్లి సీట్లను చూసి వాటిలో కూర్చొని అనుభూతి పొందారు.

రైల్వేస్టేషన్‌లో భారీ భద్రత..
వందేభారత్ రైలు తిరుపతి వెళ్తున్న సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. గతంలో వందేభారత్‌పై రాళ్లు రువ్విన సంఘటనల నేపథ్యంలో సివిల్ సర్వీస్ కేడర్ అధికారులు అందులో ప్రయాణిస్తూ ప్రజల స్పందన పరిశీలించారు. స్టేషన్‌లో సైతం భద్రత కట్టుదిట్టం చేశారు. నల్లగొండ నుంచి వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులను గుంటూరు వరకు వందేభారత్‌లో తీసుకెళ్లారు. సికింద్రాబాద్ నుంచి వచ్చిన విద్యార్థులు నల్లగొండలో దిగి మరో ట్రైన్‌లో తిరిగి వెళ్లారు.

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానం..
వందేభారత్ రైలు పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిందని రైల్వేశాఖ గుంటూరు అడిషనల్ డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. వందేభారత్ రైలు నల్లగొండ వచ్చిన సందర్భంగా ఆయన రైలు ప్రత్యేకతలను వివరించారు. ఈ రైలులో అత్యవసరమైతే కూర్చున్న సీటు నుంచే నేరుగా డ్రైవర్‌తో మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. వందేభారత్ రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో వెళ్లే సామర్థ్యం కలిగి ఉందన్నారు. అయితే ఈ రైలు సికింద్రాబాద్ నుంచి తెనాలి వరకు గంటకు 110 కిలోమీటర్ల వేగంతో.. తెనాలి నుంచి తిరుపతికి గంటకు 130 కిలోమీటర్ల వేగంతో నడుస్తుందని వెల్లడించారు. మొత్తం 520 మంది ప్రయాణించేలా.. ఏడు ఏసీ కోచ్‌లు, 1 ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ఉందని చెప్పారు. మంగళవారం మినహా రోజూ సికింద్రాబాద్‌లో ఉదయం 6 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుపతి చేరుకుంటుందని.. తిరిగి తిరుపతిలో మధ్యాహ్నం 3.10 గంటలకు ప్రారంభమై రాత్రి 11.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని తెలిపారు. సాధారణ రైళ్లలో నల్లగొండ నుంచి తిరుపతికి వెళ్లేందుకు థర్డ్ ఏసీలో రూ.935, సెకండ్ ఏసీ రూ.1310, స్లీపర్ క్లాస్ రూ.355 ఉంటుందని.. వందేభారత్‌లో చైర్ కార్‌లో రూ.1530, ఎగ్జిక్యూటివ్‌లో రూ.2780 ఉంటుందని తెలిపారు.



బీబీనగర్ మీదుగా వెళ్తున్న 'వందేభారత్'

యాదాద్రి జిల్లా నుంచి..
సాక్షి, యాదాద్రి : సికింద్రాబాద్ – తిరుపతి మధ్య ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన వందేభారత్ రైలు యాదాద్రి జిల్లాలోని బీబీనగర్, వలిగొండ, రామన్నపేట మీదుగా వెళ్లింది. తమ ప్రాంతం మీదుగా వెళ్తున్న వందేభారత్ రైలును స్థానికులు ఆసక్తిగా చూశారు. సెల్‌ఫోన్లలో చిత్రీకరించి వాట్సాప్ స్టేటస్‌లు పెట్టుకున్నారు.



నల్లగొండ రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు, బీజేపీ నాయకులు

'బలగం' యూనిట్‌కు సన్మానం



మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో దిల్‌రాజు, డైరెక్టర్ వేణు తదితరులు

- కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించిన ఎంపీ వెంకట్‌రెడ్డి
- నల్లగొండ పట్టణంలో భారీ ర్యాలీ



బలగం సినిమా డైరెక్టర్ వేణును సన్మానిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో దిల్‌రాజు

నల్లగొండ : బలగం సినిమా యూనిట్‌కు శనివారం నల్లగొండలో సన్మానం జరిగింది. స్థానిక జీఎం ఫంక్షన్ హాల్‌లో బలగం చిత్ర దర్శకుడు వేణు, నిర్మాత దిల్ రాజు, ఆయన కుమార్తె హన్షిత, ఇతర నటీనటులను కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సన్మానించారు. అంతకు ముందు ల్లగొండకు వచ్చిన కోమటిరెడ్డికి కాంగ్రెస్ కార్యకర్తలు మర్రిగూడ బైపాస్ రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి గందవారిగూడెం రోడ్డులో ఉన్న జీఎం ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

అంతా కలిసే ఉందాం : కోమటిరెడ్డి
అంతా కలిసే ఉందాం.. ఉన్నంతలో కలోగంజో తిందాం. మన బలగం, బంధుగణం, గ్రామం అంతా ఏకమై ఉండాలి. ఏవరి పార్టీలో వారు ఉండొచ్చు.. కానీ కొట్లాటకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఇది కాంగ్రెస్ మీటింగ్ కాదని.. తానెవరికీ వాహనాలు పెట్టి పిలువలేదన్నారు. కేవలం వాట్సప్‌లో మెసేజ్ చూసి వేలాది మంది రావడం ఆనందంగా ఉందన్నారు.సాయంత్రం ఎన్జీ కాలేజీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తే లక్ష మంది వచ్చే వారన్నారు. సన్మానానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, కాసర్ల నర్సిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ.. పోటీకి సై!

శాసనసభ ఎన్నికల్లో బరిలోకి దిగడానికి సమాయత్తం

- మునుగోడు, దేవరకొండ, ఆలేరు నియోజకవర్గాలపై దృష్టి
- సీపీఎంతో కలిసి ముందుకు
- రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సమావేశాల్లోనూ తీర్మానం

సాక్షి, యాదాద్రి : రానున్న శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు సీపీఐ సమాయత్తమవుతోంది. ఒకప్పుడు తమకు కంచుకోటగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఆలేరు, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనే పట్టుదలతో ఆ పార్టీ నాయకత్వం ఉంది. తమ మిత్రపక్షమైన సీపీఎంతో కలిసి పోటీ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. పోటీ విషయంపై గత నెల జరిగిన సీపీఐ రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సమావేశాల్లోనూ ఆ పార్టీ నేతలు చర్చించారు. ఇరు పార్టీలు కలిసి పోటీ చేయాలని తీర్మానించారు. సీపీఎంతో కలిసి ముందుకెళ్లనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరు రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలోనూ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నేతలకు సూచించారు.

పొత్తుపై బీఆర్‌ఎస్ నుంచి రాని సంకేతాలు
మునుగోడు ఉప ఎన్నికలో కుదిరిన అవగాహన మేరకు బీఆర్‌ఎస్, వామపక్షాల మధ్య పొత్తు ఉంటుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. కానీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సంకేతాలు అందలేదు. అయితే బీజేపీని ఎదుర్కోవాలంటే పొత్తు తప్పకపోవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్‌తో పొత్తు కుదిరితే రాష్ట్రవ్యాప్తంగా తమకు పట్టున్న స్థానాలను సీపీఐ ఎంపిక చేసుకొని జాబితాను బీఆర్‌ఎస్ అధిష్టానం ముందుంచే అవకాశం ఉంది. సీట్లు కోరడంతో పాటు గెలిపించే బాధ్యతలను కూడా ఆ పార్టీకే అప్పగించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆలేరుకు అధిక ప్రాధాన్యం
మునుగోడు, దేవరకొండ, ఆలేరు నుంచి పోటీ చేయాలని సీపీఐ నిర్ణయానికి వచ్చినప్పటికీ బీఆర్‌ఎస్‌తో పొత్తు కుదిరితే కొన్ని సడలింపులు చేసుకునే అవకాశం లేకపోలేదు. తప్పని పరిస్థితి ఎదురైతే ఆలేరుతోనే సరిపెట్టుకుంటామని సీపీఐ జిల్లా నాయకుడు ఒకరు 'సాక్షి'తో చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీతో పొత్తు కుదరని పక్షంలో సీపీఐ, సీపీఎం కలిసి మూడు చోట్ల పోటీలో ఉంటామని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

కేరళ తరహాలో కలిసి..
రానున్న శాసనసభ ఎన్నికల్లో కేరళ తరహాలో కలిసి పోటీకి దిగాలని వామపక్షాలు భావిస్తున్నాయి. కలిసిపోటీ చేయడం ద్వారా పార్టీ విజయం సాధించడం, లేదంటే భవిష్యత్‌లో అధికారం కోసం పోటీపడే స్థాయి రావచ్చని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. గతంలో ఆలేరు నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ కొన్ని చోట్ల గెలుస్తూ వస్తోంది.జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ నియోజకవర్గంలో కొంతమేరకు సక్సెస్ అయ్యారు. గత లోకసభ ఎన్నికలో సీపీఐ భువనగిరి స్థానం నుంచి రంగంలోకి దిగింది. టీడీపీతో పొత్తు ఉన్న సమయంలోనూ పలుమార్లు ఆలేరులో పోటీ చేయడానికి ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. అయితే బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానం కావడంతో సీపీఐకి ఇస్తారా లేదా అన్నది తేల్చాల్సి ఉంది.మొత్తంగా ఆలేరులో పూర్వ వైభవానికి సీపీఐ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు.

బలోపేతంపై దృష్టి
రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగాలని నిర్ణయానికి వచ్చిన సీపీఐ.. క్షేత్రస్థాయిలో బలోపేతం కావడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇంటింటికీ సీపీఐ పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజా సమస్యలపైనా పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

'పోచంపల్లి' స్టాండింగ్ కౌన్సిల్‌గా అపర్ణారెడ్డి



భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది కొంతం అపర్ణారెడ్డి నియామకం అయ్యారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 37 మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం పలువురు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న అపర్ణారెడ్డి భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, బార్ కౌన్సిల్ సభ్యుడు గండ్ర మోహన్‌రావు, బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ కన్వీనర్ కొంతం గోవర్ధన్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

యాదాద్రిలో స్వాతి నక్షత్ర పూజలు



ప్రధాన కలశాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న ప్రధానార్చకులు నరసింహాచార్యులు, అనువంశిక ధర్మకర్త

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. శ్రీస్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వయంభూ, ప్రతిష్ఠ అలంకార మూర్తులకు శతఘటాభిషేకం నిర్వహించారు. ముఖ మండపంలో బంగారు, వెండి కలశాలలో ఫలామృతాలు, సుగంధ ద్రవ్యాలు నింపి పూజలు చేశారు. వాటితో శ్రీస్వామి, అమ్మవార్లకు అభిషేకంచేశారు. ఇక ఆలయంలో గజవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు తదితర కైంకర్యాలను ఆచార్యులు శాస్త్రోక్తంగా చేపట్టారు. పలువురు భక్తులు వేకువజామున కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు.

క్లుప్తంగా

రెండు లారీలు ఢీ

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ వెనుకనుంచి మరో లారీ ఢీకొట్టింది. రెండు లారీలు వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

అనాథ వృద్ధుడి మృతదేహం ఖననం

మునగాల: మునగాల మండల కేంద్రంలో కొంతకాలంగా వీధుల వెంట భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్న ఓ వృద్ధుడు శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. సమాచారం అందుకున్న సర్పంచ్ చింతకాయల ఉపేందర్ గ్రామ పంచాయతీ సిబ్బంది సాయంతో వృద్ధుడి మృతదేహాన్ని వైకుంఠధామంతరలించి ఖననం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

రామగిరి(నల్లగొండ) : ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సర్వారం గ్రామానికి చిర్రబోయిన శంకర్(26)కు అదే గ్రామానికి చెందిన మధుకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఇద్దరు ఎదురుపడడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో శంకర్‌కు గాయాలు కాగా నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

లారీని ఢీకొట్టిన బస్సు


చిట్యాల : చిట్యాల పట్టణ శివారు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్–2 ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు పలువురు ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలదేరింది. మార్గమధ్యలో చిట్యాల పట్టణ శివారు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదంపై ఫిర్యాదు రాలేదని చిట్యాల పోలీసులు పేర్కొన్నారు.

పీఆర్‌సీ కమిటీని ప్రకటించాలి

రామగిరి(నల్లగొండ) : నూతన పీఆర్‌సీ కమిటీని వెంటనే ప్రకటించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ ఏరియర్స్, పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు గణపురం భీమయ్య, ప్రధాన కార్యదర్శి కొనకంచి వీరరాఘవులు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లను పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కె.నరేందర్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

అభాగ్యులపై 'వాత్సల్యం'

- అనాథ, పేద పిల్లలకు చేయూతగా కొత్త పథకం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలుకు శ్రీకారం
- ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ



రామన్నపేట : పేదరికం, నిరాదరణ కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు, వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పథకం ద్వారా విధి వంచితులకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూతనిచ్చేందుకు మిషన్ వాత్సల్య పథకం దోహదపడుతుంది. ఈ పథకం ద్వారా నిర్ణీత 18 ఏళ్ల లోపు వయస్సు కలిగి అర్హులైన వారికి నెలకు రూ.4వేల ఆర్థికసాయం అందిస్తారు. ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు ఈనెల 15వ తేదీలోగా అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది.

వార్షిక ఆదాయ పరిమితి ఇలా..

ఈ పథకానికి దరఖాస్తులు చేసుకునే గ్రామీణ ప్రాంతాల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96వేలకు మించరాదు. జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్‌ను పొడగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకునే పిల్లలను ఏదైనా వసతిగృహం, బాలసదనంలో చేర్పించిన తరువాత సహాయం నిలిపి వేస్తారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల విషయంలో మినహా పాఠశాలకు వెళ్లేవారి హాజరు 30రోజులకు పైగా సక్రమంగా లేదని తేలితే ఆర్థికసాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు.

మండలస్థాయి కమిటీ పరిశీలన

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సీడీపీఓ కార్యాలయానికి చేరిన అర్జీలను మండలస్థాయి కమిటీ పరిశీలిస్తుంది. ఈ కమిటీలో సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉంటారు. అర్హత కలిగి, ఎంపిక చేయబడిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకాలు చేస్తారు. మీటింగ్ మినిట్స్‌తోపాటు ఎంపికైన దరఖాస్తులను జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయానికి అందజేస్తారు.

దరఖాస్తుకు జత చేయవలసిన పత్రాలు

జనన, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పిల్లల ఆధార్ కార్డు, తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, పిల్లల వ్యక్తిగత బ్యాంకు ఖాతా లేదా తల్లిదండ్రులు లేదా సంరక్షకుడితో కలిసి ఉన్న జాయింట్ ఖాతా జిరాక్స్ పత్రాలను జత చేయాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



మిషన్ వాత్సల్య పథకాన్ని అర్హత కలిగిన అనాథ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి. అంగన్‌వాడీ టీచర్ల ద్వారా పథకంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. గడువు ముగిసిన తరువాత మండల స్థాయి కమిటీ దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను గుర్తిస్తుంది.

– శాగంటి శైలజ, సీడీపీఓ, రామన్నపేట

అర్హులు వీరే..

- మిషన్ వాత్సల్య పథకం ద్వారా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు
- పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన పిల్లలు)
- విడాకులు పొందిన తల్లిదండ్రుల పిల్లలు
- కుటుంబం వదిలిపెట్టిన పిల్లలు
- తల్లిదండ్రులకు ప్రాణాంతక వ్యాధిన పడిన వారి పిల్లలు
- తల్లిదండ్రులు శారీరకంగా అసమర్థులు (ఏదైనా అంగవైకల్యం కలిగినవారు)
- ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాల యాచకులు
- బాల్య వివాహాలు, హెచ్‌ఐవీ బారిన పడిన పిల్లలు
- కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన వారి పిల్లలు
- బాల కార్మికులు, అక్రమ రవాణా దాడులకు గురైన పిల్లలు
- పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ స్కీంలో లబ్ధిపొందుతున్న పిల్లలు ఈ పథకానికి అర్హులుగా నిర్ణయించారు. వీరి సంక్షేమానికి నెలకు రూ.4వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నారు. ఇందులో 60శాతం అంటే రూ.2,400లను కేంద్రం, మిగిలిన 40శాతం రూ.1,600లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది.

గిరిజన బాలికపై అత్యాచారం

- పెద్దఅడిశర్లపల్లి మండలంలో దారుణం
- నాలుగు రోజుల క్రితం ఫిర్యాదు చేసినా పట్టించుకోని స్థానిక పోలీసులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాలిక తల్లిదండ్రులు
- ఎస్పీ ఆదేశాలతో నిందితుడిపై కేసు

సాక్షిప్రతినిధి నల్లగొండ : ఓ కామాంధుడు గిరిజన బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చిన దారుణ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పీఏపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ గిరిజన బాలిక ఈ నెల 3న బైక్‌పై పాఠశాలకు వెళ్తోంది. గ్రామ శివారులోని ఏఎమ్మార్పీ కాలువ బ్రిడ్జి వద్దకు రాగానే మండల కేంద్రానికి చెందిన నారాయణదాసు రవితేజ మాటు వేసి బైక్‌ను అడ్డగించాడు. అనంతరం బాలికను కత్తితో బెదిరించి పెనుగులాడుతుంటే కొట్టడంతో స్పృహతప్పి పడిపోయింది. దీంతో బాధిత బాలికను బైక్‌పై గుర్తుతెలియని ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు స్పృహ వచ్చే సరికి కొండమల్లేపల్లిలో ఉంది. విషయం తల్లిదండ్రులకు చెబితే చంపివేస్తానని నారాయణదాసు బాలికను బెదిరించాడు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా..

బాధిత బాలిక దాడి నుంచి తేరుకుని ఇంటికి చేరుకుంది. తనపై జరిగిన అఘాయిత్యాన్ని తల్లిదండ్రులకు వివరించి బోరుమంది. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు ఈ నెల 5వ తేదీన గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక పోలీసులు పట్టించుకోలేదు. అనంతరం పెద్దమనుషుల సహకారంతో బాధితురాలి తల్లిదండ్రులు శనివారం నల్లగొండ ఎస్పీ అపూర్వరావును ఆశ్రయించి గోడు వెల్లబోసుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు ఎస్పీని వేడుకున్నారు. స్థానిక పోలీసులు పట్టించుకోలేదని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు పత్రంలో ఆరోపించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిందితుడిపై 323, 341, 506, 366–అ, 376(2)N)సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి గుడిపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లైంగికదాడి ఘటనపై బాధితురాలు రెండు ఫిర్యాదులు ఇచ్చారని, ఒకే పిటిషన్ ఇవ్వాలని కోరడంతో కొంత ఆలస్యం జరిగిందని గుడిపలి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి 'సాక్షి'కి వివరణ ఇచ్చారు.

డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ శివారులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారి వెంట గోల్డెన్ ఫారెస్టు భూమిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. డంపింగ్ యార్డులో ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. కానీ మున్సిపల్ అధికారులు, సిబ్బంది కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా డంపింగ్ యార్డులో రసాయన పరిశ్రమలకు చెందిన పలు రకాల వ్యర్థాలను నిల్వ చేసిన కారణంగానే ఈ అగ్ని ప్రమాదం జరిగిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

కొండమల్లేపల్లి కేజీబీవీలో డీఈఓ తనిఖీలు



పోలీసుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ భిక్షపతి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో శనివారం డీఈఓ భిక్షపతి తనిఖీలు నిర్వహించారు. కొద్ది రోజుల క్రితం అగంతకుడు పాఠశాలలోకి చొరబడిన నేపథ్యంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ తీరుపై విమర్శలు రావడంతో ఆయన పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ జీడీపీఓను పాఠశాలకు పంపి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. జీసీడీఓ సరిత, పోలీసు శాఖ నివేదికల ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. బాలికల భద్రత దృష్ట్యా ఐదుగురు ఉపాధ్యాయినులు రాత్రి డ్యూటీలో ఉంటారని చెప్పారు.

డీఈఓకు విద్యార్థి సంఘాల వినతి

కేజీబీవీ ఎస్‌ఓను సస్పెండ్ చేయాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు శనివారం డీఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. విచారణ నివేదిక రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ.ఖదీర్, రమావత్ సేవానాయక్, రమావత్ లక్ష్మణ్, కొర్ర నాగరాజునాయక్, మురళీకృష్ణ, కొత్త అఖిల్, కోటేశ్, పసుపులేటి శివ, అశోక్, శ్రీకాంత్, నరేశ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాద ఘటనలో మరో వ్యక్తి మృతి

చిలుకూరు: చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తి మృతిచెందాడు. దీంతో మృతుల సంఖ్య రెండుకు చేరింది. గరిడేపల్లి మండలం రేగులగడ్డతండాకు చెందిన బాణోతు గాంధీ కుటుంబ సభ్యులు, బంధువులు చిన్నారుల పుట్టువెంట్రుకలు తీయించేందుకు మహబూబాబాద్ జిల్లాలోని కురవి క్షేత్రానికి ఆటోలో వెళ్తూ బేతవోలు గ్రామ శివారులో ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ప్రమాదంలో బాణోతు వెంకు(55) అక్కడికక్కడే మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. వారిలో తీవ్రంగా గాయపడిన బాణోతు నాగేశ్వరరావు(45)ను శనివారం తెల్లవారుజామున సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ చల్లా శ్రీనివాసరావు తెలిపారు.

చిల్లేపల్లిలో ధాన్యం లారీల అడ్డగింత

- ఇతర జిల్లాల ధాన్యాన్ని నల్లగొండ జిల్లాలోకి అనుమతించని పోలీసులు
- చెక్‌పోస్టు వద్ద పోలీస్ బందోబస్త్.. నిలిచిన ధాన్యం లారీలు
- ఆందోళనలో సూర్యాపేట రైతాంగం
- విక్రయానికి అనుమతివ్వాలని వేడుకోలు



నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద నిలిచి ధాన్యం లారీలు

నేరేడుచర్ల : నల్లగొండ– సూర్యాపేట జిల్లాల సరిహద్దు అయినా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద ధాన్యం లారీలను శనివారం పోలీసులు అడ్డుకున్నారు. సూర్యాపేట జిల్లా ధాన్యం లారీలను అనుమతించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అంతర్ జిల్లాల మధ్య ధాన్యం కొనుగోలు అనుమతిని నిరాకరిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా పోలీసులు చిల్లేపల్లి బ్రిడ్జి వద్ద లారీలను నిలిపివేశారు. ట్రాక్టర్లల్లో వస్తే మాత్రం కొంత వరకు అనుమతి ఇస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి మిర్యాలగూడకు భారీగా ధాన్యం రావడంతో స్థానిక రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నల్లగొండ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు శనివారం మిర్యాలగూడ మండలం ఆలగడప టోల్‌గేట్ వద్ద పరిస్థితులను పరిశీలించారు. బయట జిల్లాల నుంచి వచ్చే ధాన్యాన్ని రానివ్వవద్దంటూ టోల్‌గేట్ వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. దీంతో పోలీసులు సూర్యాపేట జిల్లాకు చెందిన ధాన్యాన్ని పోలీసులు తిప్పి పంపిస్తున్నారు. తల్లాడ, వైరా, హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల నుంచి వచ్చే ధాన్యం లారీలను కూడా నిలుపుదల చేశారు.

ఇతర జిల్లాలకు వెళ్తామన్నా..

సూర్యాపేట జిల్లా రైతులు తాము నిజామాబాద్, అనంతపురం, బోదన్‌కు వెళ్తామని, అక్కడి చిట్టీలను చూపించినా కూడా పోలీసులు లారీలను అనుమతించలేదు. దీంతో రాత్రి పొద్దుపోయే వరకు కూడా చిల్లేపల్లి బ్రిడ్జి చెక్‌పోస్టు వద్దనే లారీలు నిలిచిపోయాయి. స్థానిక రైతులకు ధాన్యం ధరలు తగ్గడం వలనే ఇతర జిల్లాల నుంచి వస్తున్న ధాన్యాన్ని అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నప్పటికీ సూర్యాపేట జిల్లాలో తగినన్ని మిల్లులు లేకపోవడం వలనే మిర్యాలగూడ మిల్లుల్లోనే ఎప్పుడు అమ్ముకుంటున్నామని, కానీ ఇప్పుడు ధాన్యాన్ని అనుమతించకపోవడమేంటని రైతులు వాపోతున్నారు. దూర ప్రాంతం కావడంతో లారీల్లో తీసుకువస్తున్నామని, ఎందుకు అనుమతించరని రైతులు పోలీసులను ప్రశ్నిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, పెన్‌పహాడ్, నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు, మఠంపల్లి మండలాల నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా అధికంగా రైతులు ధాన్యాన్ని మిర్యాలగూడకు తీసుకవస్తుంటారని తెలిపారు. లారీల నుంచి తీసుకువచ్చిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అనుమతించి రైతులను ఆదుకోవాలని నల్లగొండ అధికారులను కోరుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రానివ్వొద్దు

- నల్లగొండ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం రాకుండా నిలువరించాలని నల్లగొండ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఆలగడప టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకను అరికట్టేందుకు సరిహద్దుల వద్ద చెక్ పోస్టుల ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మఠంపల్లి మీదుగా ధాన్యపు లారీలు వచ్చే అవకాశం ఉందని, వాటిని రాకుండా అడ్డుకునేందుకు ఆలగడప వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో బృందాలను ఏర్పాటు చేశామని, వారంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ నర్సింహులు, సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణారెడ్డి, సివిల్ సప్లయ్ ఆర్‌ఐ సురేందర్‌సింగ్, ఆర్‌ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలగడప చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

మోదీ గోబ్యాక్ అంటూ వామపక్షాల నిరసన

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రానికి వచ్చే అర్హత లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. ఆయా పార్టీల రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలో వేర్వేరుగా నిసరన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ఖమ్మం చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల జెండాలతో నరేంద్రమోదీ గో బ్యాక్ అంటూ సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం నాయకులు నల్లాల బావి సెంటర్‌లో నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం పట్ల విపక్ష చూపుతూ లాభాలలో నడుస్తున్న సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేసి, కోలిండియాకు అప్పగించాలని కేంద్రం దుర్బుద్ధితో ఉందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన విశ్వవిద్యాలయం లాంటి రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణకు తీరని అన్యాయం చేసిన ప్రధాని వందే భారత్ రైలు ప్రారంభం కోసం హైదరాబాద్‌కు రావటం సిగ్గుచేటు అన్నారు. ఖమ్మం క్రాస్ రోడ్డులో జరిగిన నిరసనలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మల ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి పాల్గొన్నారు. నల్లాలబావి వద్ద చేపట్టిన నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టి పెళ్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు జిల్లేపల్లి నరసింహారావు, మేకనబోయిన శేఖర్, వేల్పుల వెంకన్న, మేకనబోయిన సైదమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు పాల్గొన్నారు.

ఇంటి పైనుంచి పడి కార్మికుడు మృతి

చండూరు : ప్రమాదవశాత్తు ఇంటి పైనుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన చండూరు పట్టణంలో శనివారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చండూరుకు చెందిన నారబత్తుల సైదాచారి (40) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారీ పనిలో భాగంగా సైదాచారి శుక్రవారం పట్టణంలోని రవి ఇంటి పైకప్పుగా రేకులు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సైదాచారి అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పేట' ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువుల ఆందోళన
- విచారణ కమిటీని ఏర్పాటు చేశామన్న అధికారులు

సూర్యాపేట క్రైం : సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో శనివారం నవజాత శిశువు మృతిచెందింది. సకాలంలో వైద్యం అందించకుండా వైద్యులు నిర్లక్ష్యం చేయడం వల్లే శిశువు మృతిచెందిందని బంధువులు ఆరోపిస్తుండగా, శిశువు కడుపులోనే మృతిచెందిందని వైద్యులు పేర్కొన్నారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగారం మండల వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఉప్పాల నాగరాజు భార్య రచనకు ఈ నెల 3న నొప్పులు రావడంతో సూర్యాపేట మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చాడు. స్కానింగ్ చేసిన వైద్యులు కడుపులో శిశువు మంచిగానే ఉందని చెప్పి, మందులు ఇచ్చి ఇంటికి పంపించేశారు. ఇంటికి వెళ్లిన వెంటనే మరోమారు రచనకు కడుపు నొప్పి రావడడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకోవాలని నాగరాజు వైద్యులను ప్రాధేయపడ్డాడు. కాన్పు సమయం రాలేదని, నొప్పులు తగ్గడానికి ఇంజక్షన్లు వేస్తామని జ్వరం గోలీలు ఇచ్చి పంపించారని నాగరాజు తెలిపాడు. ఈ నెల 7 అర్ధరాత్రి మరోమారు రచనకు నొప్పులు వచ్చాయని తెలిపారు. శనివారం ఉదయం సుమారుగా 11గంటల ప్రాంతంలో పరీక్షలు చేసిన వైద్యులు కడుపులో శిశువు కదలిక లేదని చెప్పి ఆపరేషన్ చేసి చనిపోయిన మగ శిశువును గచేతిలో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. శిశువు మృతికి డాక్టర్ల నిర్లక్షమే కారణమని నాగరాజు తరఫు బంధువులు, కుటుంబ సభ్యులు మాతాశిశు ఆరోగ్య కేంద్రం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్లి డాక్టర్ మురళీధర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. శిశువు మృతికి ముగ్గురు డాక్టర్లతో కూడిన కమిటీ వేశామని, రిపోర్టు ప్రకారం చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం శిశువు మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని నాగరాజు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



సూర్యాపేటలో మంత్రి ఇంటి ఎదుట ధర్నా చేసేందుకు ర్యాలీగా వెళ్తున్న నాయకులు



సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీపై సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రజా పంథా ఆధ్వర్యంలో మంత్రి ఇంటి ముందు ధర్నా చేసేందుకు వెళ్తున్న నాయకులను పోలీసులు మధ్యలోనే అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని శాంతియుతంగా ధర్నా చేయడానికి వెళ్తున్న నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రతి ఒక్కరికీ ఉద్యోగం వస్తుందని యువత ఎన్నో కలలుగన్నదని పేర్కొన్నారు. తొమ్మిది సంవత్సరాల తర్వాత గ్రూప్–1 నోటిఫికేషన్ వస్తే కొంతమందికైనా ఉద్యోగాలు వస్తాయని సంతోషంగా ప్రిలిమినరీ రాసి 25వేల మంది క్వాలిఫై అయ్యారని, ఆ తర్వాత పేపర్ లీకేజీ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ డ్రామాలతో ఉద్యోగాలు ఇవ్వలేక నిరుద్యోగులను మోసం చేస్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని అన్నారు. అరెస్టు అయిన వారిలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జయమ్మ ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామోజీ, ప్రజాపంథా పట్టణ కార్యదర్శి గులాం, సంతోషి, పీడీఎస్‌యూ నాయకులు పుల్లూరు సింహాద్రి, పీవైఎల్ జిల్లా నాయకులు గోగుల వీరబాబు, వాజీదు, నగేష్ ఉన్నారు.

వివాహిత బలవన్మరణం

చిట్యాల : వ్యవసాయ బావిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో ఆలస్యంగా శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ ఎన్.ధర్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన మస్కు శివకృష్ణతో కవితకు ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా ఇటీవల భార్యభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలతో గొడవ పడ్డారు. దీంతో కవిత తన మేనమామ ఊరు మండలంలోని నేరడ గ్రామానికి వెళ్లి పది రోజుల పాటు ఉండి వచ్చింది. శుక్రవారం ఆమె వనిపాకల గ్రామ శివారులోని వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన స్థానికులు మృతురాలి కుటుంబ సభ్యులకు తెలిపారు. కాగా, తన మేనకోడలు కవిత మృతిపై అనుమానాలున్నాయని బోయ కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.